# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-01-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా యుఎఈ ఆర్థిక-పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

2. ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు మరిన్ని విమాన సర్వీసులను నడపనున్నామని వెల్లడించిన కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు.

3. కృష్ణాజిల్లాలోని ఘంటసాలను బౌద్ధ మత వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్.

4. సాగు నీటిసంఘాల్లో 60 వేల మంది రైతులకు ప్రాతినిధ్యం కల్పించామని పేర్కొన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

==========================

స్విట్జర్లాండ్‌లోని దావోస్  ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ -యూఏఈ  ఆర్థిక-పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్  మార్రీతో  ఈ రోజు సమావేశమైయ్యారు. ఈ సమావేశంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ -యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు  చర్చించారు. అలాగే ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమల్లో పెట్టుబడుల అవకాశాలు, పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి రంగంలో యూఏఈతో కలిసి పనిచేసేందుకు అంగీకారం కుదిరిందని, యూఏఈకి చెందిన 40 సంస్థలను రాష్ట్రంలో  ఏర్పాటు చేసేందుకు తోడ్పాటు అందిస్తామని అల్ మార్రీ పేర్కొన్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు మరిన్ని విమాన సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. స్విజ్జర్లాండ్ లోని దావస్ లో ప్రవాసాంధ్రులతో నిర్వహించిన " తెలుగు డయస్పోరా" కార్యక్రమంలో  కేంద్రమంత్రి నిన్న  పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

-----------------------

కృష్ణాజిల్లాలోని ఘంటసాలను బౌద్ధ మత వారసత్వ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి దుర్గేష్ ను ఘంటసాల అమరావతి బుద్ధ విహార్  భంతే దమ్మ (బౌద్ధ సన్యాసి) ధజ థెరో  ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు.  ఘంటసాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న 100 అడుగుల సింహాసన బుద్ధ

భగవానుల విగ్రహం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఘంటసాల బౌద్ధ ప్రాజెక్టు ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

-----------------------

నీటి భదత్ర, వాటర్ క్యాలెండర్, భూగర్భ జలాల పెంపు, వంటి అంశాలపై అమరావతిలో సాగు నీటి సంఘాల అధ్యక్షులతో ఈనెల ఆఖరి వారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమాపేశం నిర్వహించనున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటివనరుల నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించేలా సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించామని చెప్పారు. ఈ సంఘాల ద్వారా 60 వేల మంది రైతులకు సాగు నీటిరంగంలో ప్రాతినిధ్యం కల్పించామని మంత్రి పేర్కొన్నారు.

-----------------------

రాష్ట్ర సమాచార కమీషన్ -ఆర్టీఐకు నూతనంగా నియమితులైన కమీషనర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేయించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమీషన్ చీఫ్ కమీషనర్ గా వి. శ్రీనివాసరావు ప్రమాణం చేయగా, పి.సింహాచలం నాయుడు, వి.రవిబాబు, జి.ఆదెన్న, వి. శరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తిలు ఆర్టీఐ కమీషనర్లుగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, రాష్ట్ర

స్థాయిలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

-----------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 వ తేదీ నుండి 31 వరకు 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా "స్వచ్ఛత పక్షోత్సవాలు" - స్వచ్ఛతా పక్వాడాను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని మేరీస్ స్టెల్లా కళాశాలలో విద్యార్థులకు వ్యర్థాల నిర్వహణపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు లక్ష్మణస్వామి మాట్లాడుతూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ, అధికారులు తమ శాఖల పరిధిలోని పథకాల కోసం వినూత్నమైన కార్యక్రమాలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నిధులు ఎక్కువ పొందటం ద్వారా జిల్లాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చని తెలిపారు.

-----------------------

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి మురళీ మోహన్ సూచించారు. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి

నిర్వహించిన హెల్మెట్ అవగాహనా ర్యాలీని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ, హెల్మెట్ భారం కాదు ప్రాణానికి భరోసా అనే అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించడంవల్ల ప్రమాదాలు ఎదురైనప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

-----------------------

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ పేర్కొన్నారు. విజయవాడ కోర్టు ప్రాంగణంలో "మధ్యవర్తిత్వం" అనే అంశం పై నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవేంద్రనాథ్‌రాయ్ మాట్లాడుతూ, కక్షిదారులకు తక్కువ ఖర్చుతో, నిర్ణీత సమయంలో త్వరితగతిన పరిష్కారం అందించేందుకు సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం అంశాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. మధ్యవర్తిత్వంపై ఉమ్మడి కృష్ణా జిల్లాలో 35 మంది న్యాయవాదులకు ఈ నెల 23 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. వీటిని న్యాయవాదులు సద్వినియోగం చేసుకుకోవాలని సూచించారు.

-----------------------

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి మాజీ జాతీయాధ్యక్షులు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పార్లమెంట్ సభ్యులు హాజరయ్యారు.

-----------------------

తిరుమల తిరుపతి దేవస్థానం - టిటిడి పరిధిలోని ఆలయాల్లో ఈ ఏడాది మార్చి నెలాఖరు నుంచి భక్తులకు రెండుపూటలా అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. అన్నప్రసాద వితరణ ఏర్పాట్లపై తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ సింఘాల్ మాట్లాడుతూ, టిటిడి పరిధిలోని 56 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = =